# బీఆర్ఎస్ సర్కార్ వస్తేనే అభివృద్ధి

- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే రాష్ట్రం చీకటిమయం
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం/రఘునాథపాలెం, అక్టోబర్ 3: బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ గెలిస్తేనే అర్హులందరికీ అభివృద్ధి, సంక్షమ పథకాలు అందుతాయని, కాంగ్రెస్, బీజేపీలను నమ్మి వారికి అధికారం కట్టబెడితే తెలంగాణను చీకటిమయం చేస్తారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వానికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఇల్లులేని నిరుపేదలు సొంతింట్లో ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఖమ్మం వైఎస్ఆర్‌నగర్‌లో రూ.5.08 కోట్లతో నిర్మించిన 91 డబుల్ బెడ్ రూం ఇండ్లను, నూతన ప్రభుత్వ పాథమిక పాఠశాలను కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి మంత్రి అజయ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ డబుల్ బెడ్ రూం ఇండ్ల లోపలికి వెళ్లి నాణ్యతను, డిజైన్‌ను, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలోని నిరుపేదలందరూ ఆత్మగౌరవంతో బతికేందుకు వారికి గూడు కల్పించడమే సీఎం కేసీఆర్ ఉద్దేశమని స్పష్టం చేశారు. అలాగే.. ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో రూ.2.48 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అజయ్‌కుమార్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 4, 30, 51, 52 డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. 34వ డివిజన్ రంగనాయకుల గుట్టపై నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ పార్కును ప్రారంభించారు. స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో 606 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


మంగళవారం ఖమ్మం నగరంలోని 34వ డివిజన్ రంగనాయకుల గుట్టలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

## కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, ఆక్టోబర్ 3: సీఎం కేసీఆర్ సహకారంతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతున్నదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, అయ్యప్ప ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మించిన సన్నిధానం, రూ.68 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని స్పీకర్ ప్రారంభించారు. సంగమేశ్వర కాలనీలో రూ.25 లక్షలతో పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పేదలు, అట్టడుగువర్గాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గంలో సుమారు రూ.150 కోట్లతో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్టు స్పీకర్ తెలిపారు.


గర్భిణులకు సారె అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి

## సీమంతం చేయడంతో జన్మధన్యమైంది

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 3: చాలా మంది పేదవాళ్లు ఆడపిల్లకు సీమంతం చేయరని, గద్వాల నియోజకవర్గంలోని గర్భిణులకు ఓ సోదరుడిగా సీమంతం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, దీంతో తన జన్మధన్యమైందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 500 మంది గర్భిణులకు మంగళవారం ఎమ్మెల్యే దంపతులు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో సరైన వైద్యం అందక గర్భిణులు ఎంతో అవస్థలు పడేవారని, నేడు ప్రభుత్వ దవాఖానల్లో సకల సదుపాయాలు కల్పించడంతో సుఖప్రసవాలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవిస్తే.. కేసీఆర్ కిట్‌తోపాటు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ నాయుడు, రాధ, రాధమ్మ, ఇందిరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 3: నాటి ప్రభుత్వాలు మైనార్టీను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం హనుమకొండలో ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. దాస్యం మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ముస్లింను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేలా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మైనారిటీలకు రాయపుర జక్రియ ఫంక్షన్‌లో కుట్టుమిషన్లు అందజేశారు. ప్రస్తుతం కేసీఆర్ తోఫా పథకం ద్వారా నియోజవర్గంలోని 300 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఇప్పటికే మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నామని, త్వరలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలను సైతం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.


హనుమకొండలో ముస్లింలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్


ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరులో నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాములునాయక్, వైరా బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

## ఆకుపచ్చ తెలంగాణ ఘనత కేసీఆర్‌దే

- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- ఏన్కూరు ముఖ్యనాయకుల సమావేశంలో ఎంపీ నామా


వైరాటౌన్, అక్టోబర్ 3: తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ అభివృద్ధినే గెలిపిస్తారని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఏన్కూరులోని కమ్మవారి కల్యాణ మండపంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సురేశ్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా నామా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

### బావబామ్మర్దులుగా సాగుతాం

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అద్భుతంగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు అండగా ఉండి.. పార్టీ అభ్యర్థి మదన్‌లాల్‌ను గెలిపించుకుందామని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాను, మదన్‌లాల్ బావబామ్మర్దులుగా ముందుకు సాగి వైరా సీటు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వైరా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్ మాట్లాడుతూ.. వైరాలో బీఆర్ఎస్ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని, ఎంపీ నామా, ఎమ్మెల్యే రాములునాయక్ నిర్దేశకత్వంలో ముందుకు సాగి సీటు గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామని చెప్పారు.

## కిడ్నీ నుంచి 100కుపైగా రాళ్ల తొలగింపు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3: నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ వైద్యులు అరుదైన చికిత్స చేశారు. ఆరోగ్య సమస్యతో దవాఖానలో చేరిన రోగి కిడ్నీ నుంచి ఏకంగా వందకుపైగా రాళ్లు తొలగించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన హసన్ ఆదివారం కిడ్నీ సమస్యతో స్వప్న మల్టీ స్పెషాలిటీలో చేరాడు. యూరాలజీ వైద్యుడు శ్రావణ్‌కుమార్ పరీక్షించి కిడ్నీలో రాళ్లు ఉన్నట్టు గుర్తించారు. శస్త్ర చికిత్స నిపుణుడు నాళం శశికాంత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆపరేషన్ చేసి ఒకే కిడ్నీలో నుంచి చిన్నవి, పెద్దవి కలిపి 100 రాళ్లను బయటకు తీశారు.


ఆపరేషన్ చేసి కిడ్నీ నుంచి తొలగించిన రాళ్లు


ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

## ముదిరాజ్‌లకు కేసీఆర్ తొలి ప్రాధాన్యం

- సాగునీటి రాకతో మారిన పాలమూరు రూపురేఖలు
- త్వరలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం
- 5న మత్స్యకారుల భవన్ నిర్మాణానికి శంకుస్థాపన
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి
- ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం.. హాజరైన ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

వనపర్తి, అక్టోబర్ 3: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమానికే తొలి ప్రాధాన్యం ఇస్తూ, చెరువుల్లో ఉచిత చేపపిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. యువత కుల వృత్తితోపాటు ఉన్నత చదువుల వైపు దృష్టి సారించాలని మంత్రి పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో 25 వేల మందితో జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఈ నెల 5న మత్స్యకారుల భవనం కోసం రూ.2 కోట్లతో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 62 వేల మంది మత్స్యకారులకు వాహనాలు ఇచ్చామని తెలిపారు. కార్యకమంలో మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మత్స్యకారుల సంక్షేమ సంఘం జిల్లా సభ్యుడు సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దు

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 3: అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలను నమ్మి ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దని మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 3, 31, 22 డివిజన్లలో రూ.133 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం నగరంలో రూ.8 కోట్లతో చేపడుతున్న ప్రధాన రహదారుల బీటీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల సమయంలో తప్పా మరెప్పుడూ కనిపించరని విమర్శించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో 120 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించుకున్న ఘనత సీఎం కేసీఆర్‌దని గుర్తుచేశారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బీఆర్ఎస్వీ నేత మృతి


మల్లికార్జున్ (ఫైల్)

కోటపల్లి, అక్టోబర్ 3: కోటపల్లి మండల బీఆర్ఎస్ యువ నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు లింగన్నపేటకు చెంది న ఎరినాగుల మల్లికార్జున్(32) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మరణించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో కన్నుమూశాడు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు కొడుకు మల్లికార్జున్ బీఆర్ఎస్వీ నేతగా తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకైన పాత్ర పోషించాడు. బీఆర్ఎస్ పటిష్టతకు అనునిత్యం కృషి చేస్తున్న మల్లికార్జున్ మరణంతో కోటపల్లి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులలో విషాదం నిండింది. ఆయన మృతికి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ శ్రేణులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు.

